బుధవారం
07-08-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1 సంచిక: 417 పేజీలు: | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com




బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని మార్చింది 26 ఏళ్ల కుర్రాడు

మిగతా 3లో




75ఏళ్ల చరిత్ర 45 నిమిషాల్లో ముగిసింది

మిగతా 4లో



బ్రిటన్‌లో హింసాత్మకంగా మారిన నిరసనలు

మిగతా 2లో



ప్రత్యేక కలెక్షన్‌ను ఆవిష్కరించిన త్యాని బై కరణ్ జోహార్

మిగతా 5లో



# జడ్జీల స్థానంలో కూర్చుంటే తెలుస్తదీ

**న్యాయమూర్తుల ఒత్తిడి ఏంటే అర్థమవుతుంది : సుప్రీంకోర్టు సీజెఐ డి.వై.చంద్రచూడ్**

ముందడుగు జాతీయం

ప్రతిఒక్కరూ తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని కోరుతున్నారు గానీ.. న్యాయమూర్తుల మీద ఉన్న ఒత్తిడిని ఎవరూ పట్టించుకునే పరిస్థితుల్లో లేరని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గానికి చెందిన ఎమ్మెల్యేలపై అనర్హత వేసేందుకు స్పీకర్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ శివసేన (యూబీటీ) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దీనిపై ముందస్తు విచారణ చేపట్టాలని కౌన్సిల్ ధర్మాసనానికి అభ్యర్థించింది. అయితే, దీనికి సంబంధించిన పత్రాలు అందించేందుకు సమయం కావాలని ప్రతివాదులు కోరడంతో వచ్చే వారానికి వాయిదా వేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయబృందం అభ్యంతరం వ్యక్తంచేసింది. అంతకంటే ముందుగానే పిటిషన్‌ను విచారించాలని కోరింది. దీంతో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆగ్రహానికి గురయ్యారు. ''ప్రతిఒక్కరూ తమ కేసు ముందుగా విచారణ చేపట్టాలని కోరుతున్నారే కానీ, న్యాయమూర్తుల మీద ఉన్న ఒత్తిడిని ఎవరూ పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. న్యాయవాదులు ఒక రోజు జడ్జీల స్థానంలో కూర్చుంటే.. మేం ఎంత ఒత్తిడితో పనిచేస్తున్నామో అర్థమవుతుంది. ప్రతిఒక్క పిటిషన్‌పై విచారణ జరుపుతాం. దానికి ఒక తేదీని నిర్ణయిస్తాం. కోర్టులు, న్యాయమూర్తులపై ఉన్న పని ఒత్తిడిని అర్థం చేసుకోండి. అంతేగానీ, మమ్మల్ని శాసించొద్దు'' అని సీజేఐ అసహనం వ్యక్తంచేశారు.

# వాయనాడ్ లో మృతుల సంఖ్య 402

- అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం
- ఇంకా కొనసాగుతున్న సోదాలు



ముందడుగు కేరళ

కేరళలోని వాయనాడ్ లో సంభవించిన ప్రకృతి ప్రకోపానికి వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇక గల్లంతైన వారి కోసం సహాయక సిబ్బంది గత పది రోజులుగా సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తూ వచ్చారు. ఇప్పటి వరకు 402మంది మృతి చెందినట్లుగా అధికారిక వర్గాలు వెల్లడించాయి.ఇక గాలింపు చర్యల్లో భాగంగా రేపు ఉదయం 8 గంటలకు ఎస్‌కేఎంజే స్కూల్ గ్రౌండ్ నుంచి ప్రత్యేక బృందంతో కూడిన హెలికాప్టర్ చలియార్ నదిపై స్కానింగ్ మిషన్‌తో బయలుదేరుతుంది. ఆరు జోన్లలో సోదాలు కొనసాగుతాయని మంత్రి కె.రాజన్ తెలిపారు. రేపు సూచిపర సన్‌రైజ్ వ్యాలీ నుంచి అటవీ ప్రాంతాలపై దృష్టి సారిస్తారు. అటవీ ప్రాంతాలపై దృష్టి సారించి ఉదయం 8 గంటలకు తనిఖీలు ప్రారంభిస్తారు. సైన్యం మరియు అటవీ శాఖ అధికారులు శోధనకు నాయకత్వం వహిస్తారు మరియు మృతదేహాలను ఎయిర్ లిఫ్ట్ ద్వారా ఇక్కడి నుండి తరలిస్తారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రకృతి విలయం ఏర్పడితే ఇంతటి ప్రాణనష్టం ఉంటుందనడానికి వాయినాడ్ ఘటన ఉదాహరణగా నిలిచింది. టీ, కాఫీ తోటల్లో పని చేసుకునే కూలీలు, కార్మికులు వరద నీటిలో కొట్టుకుపోతే..కొందరు బండరాళ్లు కింద..బురదలో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయారు.

# రాష్ట్రపతి ముర్ముకు ఫిజీ పురస్కారం

**భారత రాష్ట్రపతి పర్యటించడం ఇదే తొలిసారి**

ముందడుగు జాతీయం

భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఫిజీ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని అందుకున్నారు. ఆ దేశ అధ్యక్షుడు రతు విలియమ్ మైవలిలీ కటోనివేర్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రస్తుతం ఫిజీ దేశ పర్యటనలో ఉన్న ఆమె ఈ అవార్డుని అందుకున్నట్లు రాష్ట్రపతి కార్యాలయం అధికారిక ఎక్స్‌లో పేర్కొంది. ఫిజీ పార్లమెంటును ఉద్దేశించి ముర్ము మాట్లాడుతూ.. ఫిజీని బలమైన. సంపన్నమైన దేశంగా మార్చేందుకు భారత్ అండగా నిలుస్తుందన్నారు. దీంతో రెండు దేశాల ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం ఫిజీ పార్లమెంటులో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడిన మాటలను గుర్తుచేశారు. ద్వీపదేశమైన ఫిజీలో భారతదేశ రాష్ట్రపతి పర్యటించడం ఇదే తొలిసారి.



ముందడుగు
బుధవారం,
07-08-2024,
హైదరాబాద్

## 'అల్‌ఖైదా' పేరుతో సీఎం కార్యాలయానికి బాంబు బెదిరింపు

ముందడుగు బీహార్

బిహార్ ముఖ్యమంత్రి కార్యాలయాన్ని పేల్చివేస్తామని శనివారం నిషిద్ధ ఉగ్రవాద సంస్థ 'అల్-ఖైదా' పేరుతో అధికారులకు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో పోలీసులు తనిఖీలు చేయగా ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదు. దీనిపై కేసు నమోదు చేసుకొని మెయిల్ పంపిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టగా అనుమానితుడిని కోల్‌కతాలో అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిని బిహార్‌లోని బెగుసరాయ్‌కు చెందిన మొహమ్మద్ జాహిద్(51)గా గుర్తించారు. కోల్‌కతాలో పాన్‌షాప్ నడుపుకుంటూ జీవిస్తున్నాడన్నారు. కాగా అతడు బెదిరింపు మెయిల్ ఎందుకు పంపాడనే విషయం ఇంకా తెలియరాలేదని, దీనిపై విచారణ కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## తమ దేశంలో వలస చట్టాలు అంగీకరించవు

- తొలుత చేరుకున్న దేశంలోనే ఆశ్రయం అడగాలి
- యూకే హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి వ్యాఖ్యలు

ముందడుగు డెస్క్

షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అక్కడి నుంచి లండన్ వెళ్లాలనేది ఆమె ప్లాన్ అని ప్రచారం జరిగింది. ఆమె అనుకున్నట్టుగా పరిస్థితులు అనుకూలించలేదని తెలుస్తోంది. యూకే నుంచి వచ్చిన స్పందనే అందుకు కారణం. ఆశ్రయం కోరుతూ లేదా శరణార్థిగా ఒక వ్యక్తి తమ దేశం వచ్చేందుకు తమ వలసచట్టాలు అంగీకరించవని యూకే హోం మంత్రిత్వ శాఖ ప్రతినిది ఓ జాతీయ మీడియాకు వెల్లడించారు. "అవసరంలో ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే విషయంలో యూకేకు గర్వించదగ్గ రికార్డు ఉంది. ఆశ్రయం కోరుతూ లేదా తాత్కాలిక శరణార్థిగా ఒక వ్యక్తి యూకే వచ్చేందుకు అనుమతించేలా నిబంధన ఏదీ లేదు. అంతర్జాతీయ రక్షణ కోరేవారు.. వారు తొలుత చేరుకున్న సురక్షిత దేశంలోనే ఆశ్రయం అడగాలి. అదే వారి రక్షణకు అత్యంత వేగవంతమైన మార్గం" అని మీడియాకు వెల్లడించారు. భారత్‌లోనే ఆశ్రయం పొందాలనే అర్థంలో పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. హసీనా సోదరి రెహానా యూకే పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరఫున పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం యూకేలో లేబర్ పార్టీనే అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే బ్రిటన్ ప్రభుత్వాన్ని హసీనా ఆశ్రయం కోరినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. బంగ్లా పరిణామాలపై బ్రిటన్ ప్రభుత్వం ఇదివరకే స్పందించింది. గత రెండు వారాలుగా అల్లర్ల కారణంగా చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు, ప్రాణ నష్టంపై ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో దర్యాప్తు జరిపించాలని కోరింది. ప్రభుత్వ మార్పు శాంతియుతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించింది.

# డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న కవిత

ముందడుగు జాతీయం

లిక్కర్ కుంభకోణం కేసులో సీబీఐ కేసుకు సంబంధించి రౌస్ అవెన్యూ కోర్టులో దాఖలు చేసిన డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం తుది విచారణను బుధవారానికి వాయిదా వేసింది. కానీ, తాజాగా పిటిషన్ ఉపంహరించుకుంటున్నట్లు కవిత తరఫున న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. చట్ట ప్రకారం ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నందున పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు వివరించారు. సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులున్నాయని పేర్కొంటూ, జులై 6న కవిత డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఎలాంటి తప్పులు లేవని సీబీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు జులై 22న ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఈ నెల 9న దీనిపై విచారణ జరపనుంది.





# బ్రిటన్‌లో హింసాత్మకంగా మారిన నిరసనలు

**భారత పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

ముందడుగు బ్రిటన్

బ్రిటన్‌లోని పలు నగరాలు, పట్టణాల్లో వలస వ్యతిరేక గ్రూపులు చేపట్టిన నిరసనలు హింసాత్మకంగా మారి, దేశమంతా విస్తరించాయి. ఈ తరుణంలో అక్కడున్న భారతీయులను కేంద్రం అప్రమత్తం చేసింది. ఈ మేరకు లండన్‌లోని భారత రాయబార కార్యాలయం అడ్వైజరీని జారీ చేసింది. "యూకేలోని పలు ప్రాంతాల్లో ఇటీవల జరిగిన అల్లర్ల గురించి భారత ప్రయాణికులకు తెలిసే ఉంటుంది. లండన్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా గమనిస్తోంది. భారత్ నుంచి వచ్చే పర్యటకులు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నాం. స్థానిక మీడియా సంస్థలు, భద్రతా ఏజెన్సీలు ఇచ్చే సూచనలను అనుసరించాలి. నిరసనలు జరుగుతోన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి" అని హై కమిషన్ సూచించింది. ఇంగ్లాండ్‌లో కొద్దిరోజుల క్రితం ఓ డ్యాన్స్ క్లాస్‌పై దుండగులు చిన్నారులపై కత్తులతో దాడి చేయడం సంచలనం రేపింది. ఆ ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతిచెందడం దేశవ్యాప్తంగా ఆందోళనలకు కారణమైంది. అది కాస్తా వలస వ్యతిరేక నిరసనలకు దారితీసింది. మాంచెస్టర్, నాటింగ్‌హం, బెల్‌ఫాస్ట్, స్టోక్ ఆన్ ట్రెంట్, బ్లాక్‌పూల్, లీడ్స్, బ్రిస్టల్, హల్, లివర్‌పూల్‌లలో నిరసనల సందర్భంగా ఆందోళనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు. రాళ్లు రువ్వడం, బాణసంచా వెలిగించి విసరడం వంటి చర్యలతోపాటు శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తున్న హోటల్‌పై దాడి చేశారు. ఆందోళనకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ప్రధానమంత్రి కీర్ స్టార్మర్.. అధికారులకు పూర్తి మద్దతు తెలిపారు.

ముందడుగు
బుధవారం, 07-08-2024, హైదరాబాద్



## బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని మార్చింది

# 26 ఏళ్ల కుర్రాడు

- రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఏకం చేసిన విద్యార్థి
- విద్యార్థి ఉద్యమం ఆమోదం లేని ఏ ప్రభుత్వం వద్దు
- ఆర్మీ చీఫ్ జనరల్‌తో భేటీ కానున్న విద్యార్థులు

ముందడుగు బంగ్లాదేశ్

బంగ్లాదేశ్‌లో దేశవ్యాప్త ఆందోళనలు తీవ్రస్థాయిలో చేసి, ఆ దేశ ప్రభుత్వాన్ని మార్చే ఉద్యమాన్ని నిర్వహించింది ఓ 26 ఏళ్ల కుర్రాడు. చిన్న ఆందోళనగా మొదలైన రిజర్వేషన్ల ఉద్యమం ఏకంగా ప్రధాని హసీనా భవితవ్యాన్ని అంధకారం చేసింది. బంగ్లాదేశ్ పతాకాన్ని నుదుటకు చుట్టుకొని తరచూ ఆందోళనల్లో మీడియాకు కనిపించాడు. మొత్తం ఉద్యమాన్ని సమన్వయం చేశాడు. ఆ యువకుడి పేరు నహిద్ ఇస్లామ్. అతడు ఢాకా విశ్వవిద్యాలయంలో సోషియాలజీ విద్యార్థి. ఈ ఏడాది జులైలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నహిద్, మరికొందరు విద్యార్థులు ఆందోళన చేస్తుండటంతో పోలీసులు అరెస్టు చేశారు. తొలిసారి అతడు బంగ్లాదేశ్ ప్రజల దృష్టిని అప్పుడే ఆకర్షించాడు. ఆ తర్వాత అదే ఉద్యమం తుపానుగా మారి ప్రభుత్వాన్ని చుట్టుముట్టింది. ఈ ఘర్షణల్లో 300 మంది విద్యార్థులు మరణించారు. వీరిలో చాలా మంది వివిధ విశ్వవిద్యాలయాలకు చెందినవారు. దీంతో హసీనా పదవికి రాజీనామా చేసి భారత్‌కు వెళ్లిపోయారు. నేటి సాయంత్రం నహిద్, ఇతర విద్యార్థి నాయకులు ఆర్మీ చీఫ్ జనరల్ వకార్ ఉజ్ జమాన్‌తో భేటీ కానున్నారు. ఈ విద్యార్థుల బృందం సైన్యం లేదా ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అంగీకరించడంలేదు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనిస్ చీఫ్ అడ్వైజర్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. విద్యార్థి ఉద్యమం ఆమోదం లేని ఏ ప్రభుత్వాన్ని అంగీకరించబోమని నహిద్ ఫేస్‌బుక్ పోస్టులో పేర్కొన్నాడు. 1998 సంవత్సరంలో ఢాకాలో నహిద్ జన్మించాడు. అతడి తండ్రి ఓ టీచర్. అతడి సోదరుడు నఖీబ్. అతడు కూడా ఈ ఉద్యమంలో పాల్గొన్నాడు. తన సోదరుడి గురించి నఖీబ్ చెబుతూ "అతడు ఎప్పుడూ దేశంలో మార్పు రావాలని ఆకాంక్షించేవాడు. అతడిని పోలీసులు అరెస్టు చేసి.. స్పృహతప్పేలా హింసించారు. ఆ తర్వాత రోడ్డుపై పారేశారు. అయినా భయపడకుండా పోరాటాన్ని కొనసాగించాడు" అని పేర్కొన్నాడు.

## తెలంగాణలో ఇంకా

# థర్డ్ డిగ్రీలు ఏంటీ..?

### షాద్ నగర్ ఘటనపై ఆకునూరి మురళి సీరియస్

ముందడుగు తెలంగాణ



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా షాద్ నగర్ ఘటన కలకలం రేపింది. దళిత మహిళపై పోలీసులు రాత్రిపూట స్టేషన్‌కు తీసుకెళ్లి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటన సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై చాలా మంది స్పందించారు. కొంచెం ఆలస్యంగానైనా రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి స్పందించారు. 'ఇప్పుడు కూడా ఈ థర్డ్ డిగ్రీ చిత్రహింసలు ఏంటండి? బుద్ధి ఉందా?' అని ఆకునూరి మురళి ఫైర్ అయ్యారు. వాస్తవానికి ఇలాంటి ఘటనలు చాలా జరుగుతాయని, బయటికి రానివి పది రెట్లు ఉంటాయని చెప్పారు. బలహీనవర్గాలపై ఇలాంటి దాడులను దయచేసి ఆపండి అంటూ పోలీసులకు ఆకునూరి మురళి విజ్ఞప్తి చేశారు. 'మీరు సెలవులు లేకుండా చాలా కష్టపడతారు. కానీ, ఇలాంటి దుర్మార్గాలతో డిపార్ట్‌మెంట్ అంతా బద్నాం అవుతుంది' అంటూ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలాంటి పోలీసుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని, డిపార్ట్‌మెంట్ క్రమశిక్షణ చర్యలతోపాటు చట్టపర చర్యలు తీసుకుని నిందితులను జైలుకు పంపాలని కోరారు. ఇంకా ఎన్నాళ్లు ఈ థర్డ్ డిగ్రీల చిత్రహింసలు? దయచేసి తెలంగాణను థర్డ్ డిగ్రీ చిత్రహింసల నుంచి విముక్తి చేయండి అంటూ రాష్ట్ర డీజీపీ ట్యాగ్ చేసి కోరారు. పోలీసుల దాడులను నిలిపేయాలని పేర్కొంటూ రాష్ట్ర సీఎంవోను ట్యాగ్ చేశారు.

## బంగ్లాదేశ్‌లో మాజీ క్రికెటర్ ఇంటికి నిప్పు

అజ్ఞాతంలోకి వెళ్లిన పలువురు క్రికెటర్లు

ముందడుగు బంగ్లాదేశ్

బంగ్లాదేశ్‌లో హింసాత్మక పరిస్థితులు మరింతగా పెరిగాయి. నిరసనకారులు ఏకంగా ఆ దేశ ప్రధాని షేక్ హసీనాను పదవి నుంచి దిగిపోయేలా చేయడంతో పాటు దేశం విడిచి పారిపోయేలా చేశారు. అంతటితో వారి ఆగ్రహావేశాలు చల్లారడం లేదు. మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ పార్టీ నేతలు, అభ్యర్థులే లక్ష్యంగా దాడులకు దిగుతున్నారు. ఈ క్రమంలో కొందరు అల్లరి మూకలు బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్, ఎంపీ ముష్రఫే మోర్తాజా ఇంటికి నిప్పు పెట్టారు. బంగ్లా మాజీ కెప్టెన్ ముష్రఫే మోర్తాజా ఇంటికి నిప్పు పెట్టిన విషయం తెలిశాక.. ఆ దేశానికి చెందిన పలువురు క్రికెటర్లు, వారి కుటుంబసభ్యులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు కథనాలు వస్తున్నాయి. తమకు మద్దతులివ్వలేదన్న కోపంతో నిరసనకారులు ఎక్కడ తమపై దాడులకు దిగుతారో అన్న భయంలో క్రికెటర్లు ఇళ్లు ఖాళీ చేసినట్లు సమాచారం.



# రైల్వే స్టేషన్‌లో ప్రసవించిన మహిళ

### వెంటనే స్పందించిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

ముందడుగు యాదాద్రి భువనగిరి

ఓ మహిళ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి రైల్వే స్టేషన్ లో ప్రసవించింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. యశ్వంత్ పుర నుంచి గోరఖ్ పూర్ వెళ్తున్న రైలులో బీహార్ కి చెందిన మహిళ హీనా కాతూన్(22) కి పురిటినొప్పులు వచ్చాయి. భువనగిరి రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే ఆ మహిళకి నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు108 సిబ్బందికి సమాచారం అందించారు. అయితే అప్పటికే రైలులోనే మహిళ ప్రసవించి ఆడబిడ్డకు జన్మనించింది. ప్రసవానంతరం తల్లిబిడ్డలను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు సిబ్బంది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని తెలిపారు వైద్యులు. ప్రస్తుతం ఐసీయూలో ఉన్నట్లు తెలిపారు.



ముందడుగు
బుధవారం,
07-08-2024,
హైదరాబాద్



# 48 విద్యార్థులు.. ఒక్కడే ఉపాధ్యాయుడు

## చదువు సాగట్లేదని బడికి తాళం వేసిన గిరిజనులు

ముందడుగు ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుర్వపల్లి కొత్తూరు గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించలేదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడిలో ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉండడం మూలంగా తమ పిల్లల చదువులు కొనసాగడం లేదంటూ తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులను బయటకు పంపి పాఠశాలకు తాళాలు వేసి ఆందోళన నిర్వహించారు. గిరిజనులు నివాసం ఉండే ప్రాంతాల్లో పాఠశాలలపై ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అదివాసీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకటి నుండి ఐదోవ తరగతి వరకు ఉన్న కురవపల్లి కొత్తూరు మండల ప్రాథమిక పాఠశాలలో 48 విద్యార్థుల చదువుకుంటున్నారు. వీరందరికీ ఒక్కరే ఉపాద్యాయుడు పాఠాలు చెపుతున్నారు. తాము ఎలాగూ చదువుకోలేదు కనీసం తమ పిల్లల నైన చదివిపించాలని అనుకున్నా అడవి బిడ్డలు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి చాలా దారుణంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తున్నారు.

# 75ఏళ్ల చరిత్ర 45 నిమిషాల్లో ముగిసింది

## ప్రాణ త్యాగం చేసిన దేశం నుంచి పారిపోయింది.. ముగిసిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్థానం

ముందడుగు డెస్క్



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా.. ఏ దేశం కోసం అయితే పోరాటం చేసిందో.. ఏ దేశ ప్రజల కోసం అయితే తన కుటుంబం ప్రాణ త్యాగాలు చేసిందో.. ఆ దేశ ప్రజలు తిరగబడటంతో.. ఆ దేశం నుంచే పారిపోయింది.. ఇదంతా జరిగింది కేవలం 45 నిమిషాల్లోనే.. నరాలు తెగే ఉత్కంఠ కొనసాగింది. 2024, ఆగస్ట్ 5వ తేదీ ఉదయం 9 గంటలకు.. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా.. కర్ఫ్యూను లెక్కచేయకుండా లక్షల మంది యువత రాజధాని ఢాకా వీధుల్లో కవాతు చేశారు. ఈ పరిస్థితిపై ప్రధాని షేక్ హసీనా అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. దేశంలో విధ్వంసం ఏ క్షణమైనా జరగొచ్చు.. మీ ప్రాణాలకు కూడా ప్రమాదం ఉందని ఆర్మీ, నేవీ, రక్షణ, పోలీస్ ఉన్నతాధికారులు మీటింగ్ లో స్పష్టం చేశారు. అయినా రాజీనామా చేయటానికి హసీనా వెనక్కి తగ్గలేదు.. మరింత బల ప్రయోగంతో ఉద్యమాన్ని కట్టడి చేయాలని ఆదేశించారు. దీనికి పోలీస్, ఆర్మీ ససేమిరా అన్నారు.. దీనిపై షేక్ హసీనా ఆగ్రహం.. మిమ్మల్ని నమ్మాను.. మీకు అధికారాలు ఇచ్చాను.. అయినా ఇంత దూరం తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల రోజుల నిర్భంధం ఇప్పుడు కట్టలు తెగించి.. ఇంతకు మించి ముందకు వెళితే మరింత ప్రమాదం అని ఆర్మీ, పోలీస్ చీఫ్ లు కూల్ చేశారు.

### సోమవారం జరిగింది ఇదే

ఉదయం 10.30 గంటలకు.. ఆర్మీ, పోలీస్ ఉన్నతాధికారులు రాజీనామా చేయమని తేల్చి చెప్పారు. షేక్ హసీనా ఒప్పకోలేదు.. ఆ వెంటనే ఆమె సోదరి రెహానాతో 10 నిమిషాలు ప్రత్యేకంగా మాట్లాడిన ఆర్మీ ఉన్నతాధికారులు.. సోదరి ద్వారా హసీనాకు నచ్చచెప్పారు. అయినా ససేమిరా అన్నారు. ఇదే సమయంలో హసీనా కుమారుడు, కుమార్తెతో ఉన్నతాధికారులు ఫోన్ లో మాట్లాడారు. పరిస్థితిని వివరించారు. అప్పటికే సమయం 10.45 నిమిషాలు.. ఆ వెంటనే కొడుకు, కుమార్తె ప్రధాని షేక్ హసీనాతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడారు.. రాజీనామా చేయాలని ఒప్పించారు. ఉదయం 10.55 నిమిషాలు.. ప్రధాని నివాసంలోనే ఉన్న ఆర్మీ, పోలీస్ చీఫ్ లకు ఇంటెలిజెన్స్ నుంచి ఫోన్. మరో 30 నిమిషాలు అంటే.. 11.30 గంటల సమయానికి లక్షల మందితో సాగుతున్న యువత కవాతు ప్రధాని ఇంటికి చేరుకుంటుంది.. వాళ్లను ఆపటం కష్టం.. ఏమైనా జరగొచ్చని హెచ్చరికలు చేశారు. ఈ సమయంలో అత్యంత వేగంగా ఆర్మీ, పోలీస్ అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. షేక్ హసీనాతోపాటు సోదరిని హెచ్చరించారు. 10 నిమిషాల్లో తీసుకోవాల్సిన వస్తువులు అన్నీ తీసుకోవాలని సమాచారం ఇచ్చారు. దీని కోసం అధికారులు సాయం కూడా చేశారు. కేవలం 45 అంటే 45 నిమిషాల్లోనే షేక్ హసీనా 76 ఏళ్ల బంగ్లాదేశ్ అనుబంధం ముగిసింది.. చరిత్ర అయ్యింది.. కొత్త అధ్యాయానికి నాంది పలికింది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబం.. ఇప్పుడు అదే దేశం నుంచి పారిపోయి.. మరో దేశంలో తలదాచుకుంటుంది. షేక్ హసీనా జీవితంలోని చివరి 45 నిమిషాల ఉత్కంఠ మాటల్లో చెప్పలేం అని.. నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిందని బంగ్లాదేశ్ పత్రికలు వెల్లడించాయి

## కాజీపేట, వరంగల్ మీదుగా IRCTC

# ఏడు జ్యోతిర్లింగాల యాత్ర

### IRCTC జోనల్ ఇంచార్జ్ కిషోర్

ముందడుగు హన్మకొండ..

కాజీపేట , వరంగల్ రైల్వే స్టేషన్ల మీదుగా ఐఆర్ సిటిసి ద్వారా ఏడు జ్యోతిర్లింగాలను దర్శించుకునే విధంగా టూర్ ప్యాకేజీని ప్రవేశపెట్టినట్లు ఐఆర్ సిటిసి జోనల్ ఇంచార్జ్ డిఎస్ జిపి కిషోర్ తెలిపారు. ఈ యాత్ర ఆగస్టు 17వ తేదీన విజయవాడ నుండి ప్రారంభమై అదే నెల 28వ తేదీ వరకు సాగుతుందని తెలిపారు. యాత్ర మొత్తం 11 రాత్రులు 12 పగలు ఉంటుందన్నారు. ఈ యాత్ర ప్రత్యేకమైన భారత్ గౌరవ్ అనే టూరిస్ట్ ట్రైన్ ద్వారా జరుగుతుందన్నారు. ఈ యాత్ర విజయవాడ, మధిర, ఖమ్మం ,డోర్నకల్ ,మహబూబాద్, వరంగల్, కాజీపేట, జనగాం ,భువనగిరి, సికింద్రాబాద్ ,నిజామాబాద్, నాందేడ్, పూర్ణ స్టేషన్ల మీదుగా సాగుతుందని తెలిపారు. యాత్రలో భాగంగా ఉజ్జయినిలో గల మహేశ్వర మరియు ఓంకారేశ్వర జ్యోతిర్లింగములు,ద్వారకలో గల నాగేశ్వర జ్యోతిర్లింగం, సోమనాథ్ లో గల సోమనాధ జ్యోతిర్లింగం, పూణేలో గల భీమశంకర జ్యోతిర్లింగం, నాసిక్ లోని త్రయంబకేశ్వర జ్యోతిర్లింగం ,ఔరంగాబాద్ లోని గృశ్నేశ్వర జ్యోతిర్లింగం మరియు తదితర పుణ్యక్షేత్రాలను  దర్శిస్తామన్నారు. ఈ యాత్ర రైలులో నాన్ ఏసీ క్లాస్ 20590, 3Ac క్లాస్ 33015, 2Ac 43355 టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఇందులో హోటల్ రూములు, భోజనం ,రోడ్డు రవాణా, ప్రయాణబీమా, టూరిస్ట్ కార్డ్స్ మరియు సీసీ కెమెరాలతో కూడిన సెక్యూరిటీతో ప్రయాణం సాగుతుందని తెలిపారు. టికెట్ బుకింగ్ కోసం , ,8287932229, 9287932228,9281030711, 9281030712 సెల్ నెంబర్లను సంప్రదించాలని ఇతర పూర్తి వివరాలకు www. Irctctourism.com వెబ్సైట్ ని చూడాలని ఆయన తెలిపారు.




ముందడుగు
బుధవారం, 07-08-2024, హైదరాబాద్

### ప్రత్యేక కలెక్షన్‌ను ఆవిష్కరించిన

# త్యాని బై కరణ్ జోహార్

ముందడుగు హైదరాబాద్

వరలక్ష్మి వ్రత పూజను పురస్కరించుకుని ప్రత్యేకంగా తీర్చిదిద్దిన , లిమిటెడ్ ఎడిషన్ కలెక్షన్  ను  విడుదల చేసినట్లు త్యాని బై కరణ్ జోహార్ వెల్లడించింది. ఈ అద్భుతమైన కలెక్షన్ జూబ్లీహిల్స్‌లోని తమ హైదరాబాద్ స్టోర్‌లో మాత్రమే అందుబాటులో ఉంచారు. విభిన్న వ్యక్తుల  అభిరుచులు మరియు ప్రాధాన్యతలను తీర్చడానికి రూపొందించబడిన ఈ అద్భుతమైన ఆభరణాలు,  ప్రతి వ్యక్తి తమ పరిపూర్ణ ఆభరణం కనుగొనగలరనే భరోసా అందిస్తుంది. త్యానీకి చెందిన రిషబ్ మాట్లాడుతూ, "వరలక్ష్మి వ్రత పూజ వేళ ఈ ప్రత్యేకమైన కలెక్షన్ విడుదల చేయటం పట్ల మేము సంతోషిస్తున్నాము.  ఈ కలెక్షన్ లోని ప్రతి ఆభరణం,  ఆధునిక సౌందర్యంతో సాంప్రదాయ అంశాలను మిళితం చేసేలా ఆలోచనాత్మకంగా రూపొందించబడింది. ఈ కలెక్షన్ వారి వేడుకలకు ప్రత్యేక సొబగులు మరియు వైభవాన్ని జోడిస్తుందని నమ్ముతున్నాను " అని అన్నారు.






# కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్‌లో ప్రాక్సిమస్ సీజర్

ముందడుగు

వెస్ బాల్ ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ గ్లోబల్ ఎపిక్ ఫ్రాంచైజీకి కింగ్‌డమ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్‌తో కొత్త జీవితాన్ని అందించారు. ఇది సీజర్ పాలన తర్వాత అనేక తరాల తర్వాత జరిగిన కథ. ఈ యుగంలో, కోతులు సామరస్యపూర్వకంగా జీవిస్తున్న ఆధిపత్య జాతులు. అయితే మానవుల దయాదాక్షిణ్యాలపై జీవించే స్థితిని కలిగి ఉంటారు. ఒక కొత్త నిరంకుశ కోతి నాయకుడు తన సామ్రాజ్యాన్ని నిర్మిస్తాడు. అక్కడ ఒక యువ కోతి భయంకరమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. గతానికి సంబంధించి తనకు తెలిసిన ప్రతిదాన్ని ప్రశ్నిస్తుంది. కోతుల మరియు మానవుల కోసం భవిష్యత్తును నిర్వచించే ఎంపికలను పేర్కొంటుంది.  కెవిన్ డురాండ్ ప్రాక్సిమస్ సీజర్‌గా స్క్రీన్‌పై తనను తాను చూసుకున్న అనంతరం ప్రతిస్పందిస్తూ, “ఇది అద్భుతంగా ఉంది. వెటా డిజిటల్ అటువంటి చక్కని పని చేసింది. ప్రాక్సిమస్ ఈ సిరీస్‌లో మనం చూసిన అత్యంత స్పష్టమైన కోతి అని మీకుతెలుసా? ఈ పాత్ర ద్వారా చక్కని అభినయాన్ని ప్రదర్శించేందుకు అవకాశం దక్కడం నా అదృష్టం. ఈ పాత్రను పోషించడం నాకు చక్కని అనుభూతిని మిగిల్చింది” అని తెలిపారు.